సాక్షి
విజయనగరం
శనివారం । 13 । జనవరి । 2024



వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ ప్రారంభం

-IIలో

వీరఘట్టంలో వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌ను పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ ప్రారంభించారు.



నెలాఖరులోగా 2,112 టిడ్కో ఇళ్లలో గృహప్రవేశాలు

-IIలో

ఈ నెలాఖరులోగా టిడ్కో ఇళ్ల గృహప్రవేశాలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఏపీ టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు.



రెండేళ్ల ప్రయోగానికి గుర్తింపు

గైడ్ టీచర్ మార్గదర్శకత్వంలో రెండేళ్లుగా ప్రయోగాలు చేస్తున్న విద్యార్థుల కృషి ఫలించింది.

-IIలో

న్యూస్‌రీల్

పటిష్ఠంగా లైంగిక వేధింపుల నిరోధక చట్టం

విజయనగరం అర్బన్: పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం పటిష్ఠంగా అమలు చేయాలని అధికారులను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై రూపొందించిన వార్షిక క్యాలెండర్‌ను కలెక్టర్ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి, డీఆర్‌ఓ ఎస్.డి.అనిత, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శాంతకుమారి, కె.విజయకుమారి, ఎస్.విద్య, పి.సాయిలక్ష్మి పాల్గొన్నారు.

రామతీర్థంలో సహస్ర దీపాలంకరణ



రామతీర్థంలో సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి వారి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వెండి మండపంలోని సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణ నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి, దీపారాధన మండపంలో ఉన్న ప్రత్యేక ఊయలలో ఉంచి పూజలు చేశారు. అనంతరం సహస్రదీపాల శోభలో సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తి శ్రద్ధలతో దీపాలను వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు సాయి రామాచార్యులు, రామ గోపాల్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ విభాగానికి అదనపు గదుల ప్రారంభం



రిబ్బన్ కట్ చేసి నూతన గదులను ప్రారంభిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయం ప్రాంగణంలో ఉన్న కమ్యూనికేషన్ విభాగానికి సంబంధించి నిర్మించిన అదనపు గదులను ఎస్పీ ఎం.దీపిక శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కమ్యూనికేషన్ విభాగంలో పనిచేసే మహిళా సిబ్బంది వేచి ఉండేందుకు, కమ్యూనికేషన్ విభాగం పరికరాలను ఉంచేందుకు స్టోర్‌రూమ్ అవసరమని తెలపడంతో, వాటిని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. కమ్యూనికేషన్ సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గదుల నిర్మాణానికి శ్రమదానం చేసిన పోలీస్ సిబ్బంది, హోంగార్డులను ప్రత్యేక అభినందించి, వారికి కొత్త బట్టలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ట్రైనీ ఐపీఎస్ మండ జావలి అల్ఫాన్స్, డీఎస్పీలు డి.విశ్వనాథ్, ఆర్.గోవిందరావు, ఆర్.శ్రీనివాసరావు, యూనివర్స్, సీఐలు కేకేవీ.విజయనాథ్, ఈ.నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ పాలక మండలి కాలపరిమితి పెంపు

విజయనగరం అర్బన్: డీసీసీబీ పాలక మండలి కాలపరిమితిని మరో ఆరునెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసిందని డీసీసీబీ సీఈఓ కె.జనార్దన తెలిపారు. ఈనెల 18వ తేదీతో ముగియనున్న పాలన కాలపరిమితి గడువును పెంచిందని, అంతవరకు ప్రస్తుతం ఉన్న ఏడుగురు సభ్యుల పాలక మండలి ఉంటుందని తెలిపారు.

ప్రకృతి సాగు మేలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయం విభాగం జిల్లా మేనేజర్ ఆనందరావు

విజయనగరం ఫోర్ట్: ప్రకృతి సాగు పద్ధతిలో వ్యవసాయం చేయడం వల్ల అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం విభాగం జిల్లా మేనేజర్ ఎం. ఆనందరావు అన్నారు. శుక్రవారం స్థానిక రైతు శిక్షణ కేంద్రంలో విజయనగరం డివిజన్‌కు చెందిన రైతులతో వ్యవసాయ సిబ్బంది ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. 2025 మార్చి నాటికి ఎంత మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తారో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. ప్రకృతి సాగు పద్ధతిలో పండించిన ఆహార ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేస్తాయని తెలిపారు.

మార్గం సుగమం



నేడు: కొత్తగా రోడ్డు నిర్మాణం పూర్తయ్యాక...

- దశాబ్దాల సమస్యకు పరిష్కారం చూపిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం
- రూ.8.82 కోట్లతో కొత్తరోడ్డు నిర్మాణం
- రాజాం జీఎంఆర్ ఐటీ నుంచి రేగిడి మండలం సంకిలి వరకూ తారురోడ్డు
- తొలగిన ప్రయాణ కష్టాలు
- కొత్త రోడ్డు నిర్మాణంతో స్థానికుల్లో హర్షాతిరేకం

రేగిడి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమం, అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యమిస్తోంది. ఓ వైపు అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలు మంజూరుచేస్తోంది. మరోవైపు దశలవారీగా అభివృద్ధి పనులను పూర్తిచేస్తోంది. దశాబ్దాలుగా ప్రజలను వెంటాడుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతోంది. రోడ్లను నిర్మించి ప్రజల రాకపోకల కష్టాలకు చెక్‌పెడుతోంది. గ్రామీణ, ప్రధాన మార్గాల్లో ప్రయాణాన్ని సుగమం చేస్తోంది.

15 ఏళ్ల నాటి సమస్యకు చెక్..

రాజాం–పాలకొండ రోడ్డు గతంలో అధ్వానంగా ఉండేది. గత టీడీపీ ప్రభుత్వం రోడ్డు అభివృద్ధిని విస్మరించింది. ఈ ప్రాంత ప్రజలు, నాయకులు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో 15 కిలోమీటర్ల మేర రోడ్డుపై ప్రయాణం నరకాన్ని తలపించేది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తొలుత రూ.38 లక్షలతో మరమ్మతులు చేయించింది. అనంతరం రహదారి విస్తరణకు, కొత్త రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈలోగా కోవిడ్ రావడంతో పనులు తాత్కాలికంగా నిలిచిపోగా, రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులు రోడ్డు నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే కంబాల జోగులు ప్రత్యేక చొరవ చూపడంతో నాలుగు నెలలు కిందట రీ ఎస్టిమేషన్ వేయించి, రాజాం నుంచి సంకిలి వరకూ కొత్తరోడ్డు నిర్మాణానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపించారు. సకాలంలో నిధులు మంజూరు కావడంతో రోడ్డు నిర్మాణం త్వరితగతిన పూర్తిచేస్తున్నారు. 15 ఏళ్ల నాటి ప్రధాన రహదారి సమస్యకు పరిష్కారం లభిస్తుండడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నాడు: రాజాం–పాలకొండ రోడ్డు

నిర్మాణం ఇలా..

రోడ్డు: రాజాం జీఎంఆర్ ఐటీ నుంచి రేగిడి మండలం సంకిలి వరకు
నిధులు: రూ.8.82 కోట్లు
పొడవు: 15 కిలోమీటర్లు
వెడల్పు: ఆరు మీటర్లు
ఇప్పటివరకు పూర్తయిన పనులు: 70 శాతం
పూర్తిచేయాల్సినది: ఉంగరాడ మెట్ట, మజ్జి రాముడుపేట గ్రామాల వద్ద సీసీ రోడ్డు

నాణ్యతకు పెద్దపీట

రాజాం జీఎంఆర్ ఐటీ నుంచి సంకిలి వరకూ నిర్మిస్తున్న రహదారిని నాణ్యతతో నిర్మిస్తున్నారు. పూర్తిగా మలుపులు ఉన్నచోట జంగిల్ క్లియరెన్స్ చేసి మలుపుల ప్రమాదాన్ని తప్పించి రోడ్డు వేస్తున్నారు. గతంలో నీరు నిల్వ ఉండి ఎక్కువగా గోతులు ఏర్పడే ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్టు ఆర్అండ్‌బీ డీఈఈ కె.వి.ప్రసాదరావు తెలిపారు.

ఇన్నాళ్లకు రోడ్డుకు మోక్షం



గతంలో ఈ రహదారిని టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. 2013 నుంచి రోడ్డు ప్రమాదకరంగా మారింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రోడ్డు అవసరాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్‌ల చొరవతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. పనులు మరికొద్ది రోజుల్లో పూర్తికానున్నాయి.

– వావిలపల్లి జగన్మోహనరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, బూరాడ, రేగిడి మండలం

ప్రయాణ యాతన ఉండదిక



జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా సమస్యలు తెలుసుకుంటోంది. వెంటవెంటనే పరిష్కరిస్తోంది. ప్రతిరోజు వందలాది వాహనాలు ప్రయాణించే పాలకొండ–రాజాం రోడ్డును అభివృద్ధి చేస్తోంది. ప్రయాణ యాతన ఇక ఉండదు. ఒక్క రేగిడి మండలంలో 39 పంచాయతీల పరిధిలోని 78 గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుంది.

– టంకాల అచ్చెన్నాయుడు, వైస్ ఎంపీపీ, రేగిడి మండలం

● కూడార్తై ఉత్సవం



రింగురోడ్డు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 108 గిన్నెలలో స్వామివారికి నైవేద్యం

ధనుర్మాసాన్ని పురస్కరించుకుని వైష్ణవ ఆలయాల్లో కూడార్తై ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విజయనగరం టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో కొలువైన వేంకటేశ్వరస్వామికి ఆలయ ప్రధాన అర్చకుడు పి.వి.నరసింహాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు జరిపారు. గోదాదేవిని ప్రత్యేకంగా అలంకరించారు. రింగురోడ్డులోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి 108 గిన్నెలలో ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పించారు.

– విజయనగరం టౌన్



టీటీడీ ఆవరణలో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

విజయనగరం టౌన్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని మైత్రీ మీడియా ఆధ్వర్యంలో రంగవల్లికల పోటీల నిర్వహించడం అభినందనీయమని జిల్లా అదనపు ఎస్పీ అస్మాఫర్హీన్ అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా జీటీపీఎల్ మైత్రీమీడియా చానెల్, ఎస్‌ఆర్ షాపింగ్ మాల్ సంయుక్తంగా గురజాడ కళాభారతి వేదికగా రంగవల్లికల పోటీలను శుక్రవారం నిర్వహించాయి. పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగ్గులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు కాపుగంటి సుధ, సభ్యులు ఉమాబాలాజీ, లక్ష్మీశ్రీనివాస్, మానస, విశాలి, లతలు జడ్జిలుగా వ్యవహరించారు. రంగోలీ పోటీల్లో మొదటి బహుమతిగా ఆర్.శారదకు బంగారు నెక్లెస్, ద్వితీయ విజేత సీతాకుమారికి బంగారు చెవిదిద్దులు, మూడో విజేత మణికి 43 ఇంచీల స్మార్ట్ టీవీలను అందజేశారు. ట్రెజర్ హంట్ కార్యక్రమంలో విజేతలైన అనూష, హైమావతి, చిన్నారావు, అనూష, సంధ్య, ఉమా మహేష్, లక్ష్మి, ఆదిలక్ష్మి, అరుణకుమారి, పార్వతీలకు వెట్ గ్రైండర్లు, ప్యూరిఫైర్స్, ఎయిర్ కూలర్, వాషింగ్ మెషీన్, కలర్ టీవీలను బహుమతులుగా అందజేశారు. విజేతలను పోటీల నిర్వాహకులు అవనాపు విక్రమ్, సీతారామారాజు, ముధునూరి నకుల్‌వర్మ అభినందించారు.

చకచకా ధాన్యం బిల్లుల చెల్లింపు

- ఒక్కరోజులోనే రైతుల ఖాతాలకు రూ.351 కోట్లు జమ

విజయనగరం అర్బన్:

ఆరుగాలం శ్రమించి సాగుచేసిన పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయడం, వెంట వెంటనే ధాన్యం డబ్బులు ఖాతాలకు జమ చేస్తుండడంతో రైతుల ఇంట సంక్రాంతి శోభ కనిపిస్తోంది. జిల్లాలో ధాన్యం విక్రయించిన రైతులకు శుక్రవారం ఒక్కరోజులోనే రూ.351 కోట్లు ధాన్యం బిల్లులను ప్రభుత్వం చెల్లించింది. ఖరీఫ్ 2023–24 సీజన్‌కు జిల్లాలోని 484 రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 2.63 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం 65,206 మంది రైతుల నుంచి జిల్లా యంత్రాంగం కొనుగోలు చేసింది. కొనుగోలు చేసిన ధాన్యంకు రూ.464 కోట్ల బిల్లులు నేరుగా రైతుల ఖాతాల్లో జమచేసింది. ఇప్పటి వరకు ధాన్యం విక్రయించిన రైతులకు పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించినట్టు జేసీ కె.మయూర్ అశోక్ తెలిపారు.

ప్రజారోగ్యానికి భరోసా

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

రామభద్రపురం: ప్రజారోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని డీఎంహెచ్‌ఓ భాస్కరరావు అన్నారు. బూసాయవలసలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. వైద్యులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. రూపాయి ఖర్చులేకుండా నాణ్యమైన వైద్యసేవలు అందిస్తోందని తెలిపారు. ప్రత్యేక ఆరోగ్యశిబిరాల ద్వారా వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసేందుకు స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉంటారన్నారు. ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భద్రత కల్పించాలనే గొప్ప ఉద్దేశంతో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమామణి, వైద్యాధికారి అపర్ణ పాల్గొన్నారు.



బూసాయవలసలో వైద్యాధికారులకు సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో బొబ్బిలి అ'ద్వితీయ'ం

బొబ్బిలి:

ఇంటింటి చెత్త సేకరణ, చెత్తతో ఎరువుల తయారీ, పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసుల నిషేధం, పట్టణ పరిశుభ్రతలో బొబ్బిలి పురపాలక సంఘానికి అరుదైన గౌరవం దక్కింది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో బొబ్బిలి పురపాలక సంఘానికి రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు లభించింది. లక్షలోపు జనాభా కలిగిన పురపాలక సంఘాల్లో దక్షిణ భారత దేశంలోనే 8వ ర్యాంకు సాధించినట్టు కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు.

సమీకృత వ్యవసాయం మేలు



సమావేశంలో మాట్లాడుతున్న పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్

పార్వతీపురంటౌన్: జీవ వైవిధ్యాన్ని కాపాడుకునేందుకు ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమన్వయంతో కృషిచేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ పిలుపునిచ్చారు. పార్వతీ పురం మన్యం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం రెయిన్ ఫారెస్టు అలయెన్స్ ఎగ్జిక్యూటింగ్ ఏజన్సీ వారితో సస్టైనబుల్ అగ్రికల్చర్ అండ్ బయో డైవర్సిటీ ఎక్రాస్ ల్యాండ్స్ ల్యాండ్‌స్కేప్స్ ప్రాజెక్టుపై అవగాహన సదస్సు నిర్వహించారు.

కార్యక్రమంలో విష్ణుచరణ్ మాట్లాడుతూ వాతావరణ మార్పులు, అడవులు, అక్రమణ, వ్యవసాయ క్షేత్రాల విస్తరణతో జీవవైవిధ్యం దెబ్బతింటుందన్నారు. జీవవైవిధ్యాన్ని కాపాడే విధంగా సమీకృత వ్యవసాయ విధానాన్ని చేపట్టాలని, అందుకు స్థానిక ప్రజలకు ప్రోత్సాహం అందించాలని చెప్పారు. సమీకృత వ్యవసాయ విధానంతో సామాజిక ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రణాళికలను రూపొందించాలని వ్యవసాయ అనుబంధ శాఖలకు సూచించారు. రాష్ట్రప్రభుత్వం, రైతు సాధికార సంస్థ, స్థానిక పౌర సమాజ సంస్థల భాగస్వామ్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు రెయిన్ ఫారెస్టు అలయన్స్ లీడ్ ఎగ్జిక్యూటింగ్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందన్నారు. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం ఇంటర్నేషనల్ యూని యన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ అమలు చేసే ఏజెన్సీలన్నీ వారితో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రాజెక్టును విజయవంతం చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టు వివరాలను రెయిన్‌ఫారెస్టు అలయన్ సంస్థ కన్సెల్టెంట్ కె.శ్రీధర్ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డీఎం పి.షణ్ముఖరాజు, జిల్లా ఉద్యాన అధికారి కె.వరప్రసాద్, మత్స్యశాఖ, వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అందరివాడు

- కలెక్టరేట్‌లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు చర్యలు
- కలెక్టర్ నాగలక్ష్మి



ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి



విద్యార్థిని నృత్య ప్రదర్శన

విజయనగరం అర్బన్: కుల మతాలకు అతీతంగా, అన్ని వర్గాల వారి హక్కులు, అభ్యున్నతి కోసం పాటుపడిన అంబేడ్కర్ అందరివాడని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. చదువు, విజ్ఞానంతో వివక్షపై విజయం సాధించారన్నారు. సామాజిక సమతా సంకల్ప మహోత్సవంలో భాగంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అంబేడ్కర్ జీవిత చరిత్రపై సమాచారశాఖ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఉద్యోగం కోసం ఉన్నత చదువులు చదవలేదని, విజ్ఞానార్జన కోసం, సమాజానికి తన చదువు ఉపయోగపడాలని చదివారని తెలిపారు. చదువే కాకుండా కుల, మత, రాజకీయ, ఆర్థిక అంశాలపై అనేక పుస్తకాలను రచించారని, విద్యార్థులు కొంత సమయాన్ని కేటాయించి ఆయన రచనలను చదవాలని సూచించారు. ప్రతి విద్యార్థి అంబేడ్కర్ జీవిత చరిత్రను తెలుసుకోవాలన్నారు. సచివాలయ పరిధిలో సేకరించిన సంతకాలతో కూడిన ఫ్లెక్సీలను అంబేడ్కర్ స్మృతి వనంలో డిస్‌ప్లే చేస్తారని తెలిపారు. దళిత నాయకుల అభ్యర్థన మేరకు కలెక్టరేట్‌లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, అంబేడ్కర్ భవన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని వెల్లడించారు. జేసీ కె.మయూర్‌అశోక్ మాట్లాడుతూ ఈ నెల 19న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని విజయవాడ స్వరాజ్య మైదానంలోని 19 ఎకరాల విస్తీర్ణంలో రూ.404 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించనుందన్నారు. అన్ని జిల్లాల్లో ఈ నెల 9 నుంచి 19 వరకు సచివాలయ పరిధిలో కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. సంక్రాంతి తర్వాత మానవ హారం, మారథాన్, రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ గొప్పదనంపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆలోచింపజేశాయి. అంబేడ్కర్‌పై గంటాన అప్పారావు, వేపాడకు చెందిన అంబేడ్కర్ కళాబృందం ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. సమావేశంలో గిరిజన యూనివర్సిటీ ప్రొఫెసర్ జితేంద్రమోహన్, డీవీఎంసీ సభ్యులు జయరాజ్, భానుమూర్తి, శ్రీను, దళిత నాయకులు ఉదయ్ భాస్కర్, రామునాయుడు తదితరులు మాట్లాడారు. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రామానందం, డీఐపీఆర్‌ఓ డీ.రమేష్, టూరిజం అధికారి లక్ష్మీనారాయణ, జీఎస్టీ నిర్మలాదేవీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి రూ.10లక్షల చెక్కు అందజేత



మృతుని కుటుంబానికి చెక్కు అందజేస్తున్న జూ అధికారులు

దత్తిరాజేరు: విశాఖ జూలో విధి నిర్వహణలో ఉన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి బి.నగేష్ ఎలుగుబంటి దాడిలో గత ఏడాది నవంబర్ 27న మృతిచెందడంతో ఆయన కుటుంబానికి రూ.10లక్షల చెక్కును క్యూరేటర్ సాలరియా అందజేశారు. ఈ మేరకు శుక్రవారం జూకు మృతుడి కుటుంబసభ్యులను పిలిపించి మృతుడి తండ్రి తవుడుకు చెక్కుతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తున్నట్లు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మంత్రి అప్పలనాయుడు, మృతుని కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై పాపారావు

బలిజిపేట: బలిజిపేట గ్రామానికి చెందిన జి.వెంకటరమణ(35) స్నానానికి వెళ్లి చెరువులో జారిపడి మృతి చెందాడని ఎస్సై పాపారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకటరమణ, స్నేహితుడు సాయిరాంలు ఉదయం గ్రామ సమీపంలో ఉన్న నైరేడు కోనేరుకు వెళ్లారు. సాయిరాం చెరువుగట్టుపై కూర్చుని ఉండగా వెంకటరమణ స్నానం నిమిత్తం చెరువులో దిగి ఒక్కసారిగా జారిపోయాడు. ఈత రాకపోవడం, లోతు ఎక్కువగా ఉండడంతో నీళ్లు తాగేశాడు. ఇంతలో గట్టుమీద ఉన్న సాయిరాం కేకలు వేయడంతో కొందరు వచ్చి వెంకటరమణను చెరువులో నుంచి బయటకు తీసి బలిజిపేట పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. భార్య ఆరుద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పాపారావు తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹100	₹170	₹180

వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ ప్రారంభం

- మహిళాసంఘాలు ఆర్థిక స్వావలంబన సాధించాలి: కలెక్టర్
- త్వరలో గుమ్మలక్ష్మీపురంలో మార్ట్ ఏర్పాటు: డీఆర్‌డీఏ పీడీ



వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్



మహిళా మార్ట్‌లో సరుకులు కొనుగోలు చేస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్



క్యాష్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

వీరఘట్టం: వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌లు అందరికీ అందుబాటులోకి రావడం ఎంతో ఆనందంగా ఉందని, మహిళా సంఘాలు ఆర్థిక స్వావలంబన సాధించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆకాంక్షించారు. ఇటీవల వీరఘట్టంలో డ్వాక్రా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ మహిళా మార్ట్‌ను కలెక్టర్ నిషాంత్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. కార్పొరేట్ స్థాయిలో ఉన్న ఈ షాపును మహిళా సంఘాలు నిర్వహిస్తుండడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. అన్నీ బ్రాండెడ్ వస్తువులతో పాటు సామాన్యులకు కావాల్సిన నిత్యావసర సరుకులు కూడా అందుబాటులో ఉండడాన్ని గమనించారు. మార్కెట్ ధరల కంటే తక్కువకే నిత్యావసర సరుకులు లభిస్తుండడంతో సంతోషం వ్యక్తం చేశారు. మహిళా సంఘాలు బలోపేతమయ్యాయని చెప్పడానికి ఈ మార్ట్ ఏర్పాటు ఒక నిదర్శనంగా చెప్పవచ్చన్నారు. ఈ మహిళా మార్ట్‌ను అందరూ ఆదరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం తన ఇంటికి కావాల్సిన సరుకులను కలెక్టర్ నిషాంత్ కుమార్ కొనుగోలు చేశారు. ఈ మార్ట్‌ను సక్రమంగా నిర్వహించాలని మహిళా సంఘాలకు కలెక్టర్ సూచించారు.

త్వరలో గుమ్మలక్ష్మీపురంలో మార్ట్

గుమ్మలక్ష్మీపురంలో వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ త్వరలో ఏర్పాటు చేస్తామని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ కలెక్టర్‌కు తెలిపారు. మండలంలోని 1756 డ్వాక్రా సంఘాల్లో ఉన్న 19,316 మంది మహిళా సభ్యుల నుంచి రూ.30 లక్షల మూలధనాన్ని సేకరించి వ్యాపారాన్ని ప్రారంభించామని పీడీ తెలిపారు. ఈ ప్రాంతంలో అటవీ ఉత్పత్తులు ఎక్కువగా లభిస్తున్నందున కొద్ది రోజుల్లో అటవీ ఉత్పత్తుల ఫలసాయాన్ని కూడా మార్కెటింగ్ చేస్తామన్నారు.

వ్యాపార కేంద్రంగా వీరఘట్టం

త్వరలో వీరఘట్టం పట్టణం గొప్ప వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. కలెక్టర్ ప్రారంభించిన వైఎస్సార్ చేయూత మహిళామార్ట్‌లో క్యాష్ కౌంటర్‌ను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ప్రారంభించారు. అన్నీ బ్రాండెడ్ సరుకులు ఇక్కడ లభిస్తుండడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వీరఘట్టం మండల ప్రజలు ఈమార్ట్‌ను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, తహసీల్దార్ చందక సత్యనారాయణ, ఎంపీడీఓ డి.శ్వేత, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు, ఏపీఎం శివున్నాయుడు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు పి.సుజాత,మార్ట్ అధ్యక్షురాలు పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా 2112 టిడ్కో ఇళ్లలో గృహప్రవేశాలు

- ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్
- సారిపల్లి, సోనియానగర్‌లలో పర్యటన



టిడ్కో గృహ సముదాయాల్లో వసతుల కల్పనపై అధికారులతో మాట్లాడుతున్న చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన 1.50 లక్షల టిడ్కో ఇళ్లలో గృహప్రవేశాలు చేసేలా చర్యలు చేపడుతున్నామని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు. ఈ మేరకు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పేదలకోసం సారిపల్లి, సోనియానగర్ ప్రాంతాల్లో నిర్మించిన గృహ సముదాయాలను సంబంధిత అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవరి నెలాఖరులోగా సారిపల్లి ప్రాంతంలో నిర్మించిన 1024 ఇళ్లలో, సోనియానగర్‌లో నిర్మించిన 1088 ఇళ్లలో సంబంధిత లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గృహప్రవేశాలకు సంబంధించి ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావులతో కలిసి చర్చించినట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో 95 వేల టిడ్కో ఇళ్లలో గృహ ప్రవేశాలు పూర్తయ్యాయని, ఫిబ్రవరినెల ప్రారంభ సమయానికి ప్రభుత్వం నిర్దేశించిన ఒక లక్షా యాభై వేల ఇళ్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమం చేపడతామన్నారు. టిడ్కో లబ్ధిదారులకు సుమారు రూ.10లక్షల విలువైన ఆస్తిని జగనన్న కానుకగా ఇవ్వడం దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయలేని మహోత్తర కార్యక్రమమన్నారు. కార్యక్రమంలో టిడ్కో ఈఈ జ్యోతి, డీఈఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్ల ప్రయోగానికి గుర్తింపు

- జాతీయస్థాయి ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు కంచరాం విద్యార్థులు



విద్యార్థులు, గైడ్ టీచర్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం వసంతకుమార్



కాంతికి సంబంధించి ప్రయోగం చేస్తున్న విద్యార్థులు

రాజాం సిటీ: గైడ్ టీచర్ మార్గదర్శకత్వంలో రెండేళ్లుగా ప్రయోగాలు చేస్తున్న వారి కృషి ఫలించింది. ఈ మేరకు కేంద్రప్రభుత్వం జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్, స్టూడెంట్ సైన్స్ విలేజ్-వర్క్‌షాప్‌కు ఎంపికై శభాష్ అనిపించుకున్నారు. ఈ నెల 17 నుంచి 20 వరకు హర్యానా రాష్ట్రంలోని 'ట్రాన్స్‌లేషనల్ హెల్త్‌సైన్స్ అండ్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్ వేదికగా అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్న 'ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్'కు రాజాం మండలంలోని కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు పెనుబోతుల సౌజన్య, పిల్లా శిరీష, పోతల చరణ్, బార్నాన దినేష్, పైల సత్యవతిలు ఎంపికయ్యారని భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పందూరు వేణుగోపాల్ తెలిపారు. జాతీయస్థాయి కార్యక్రమం అమృత్‌కాల్‌లో సైన్స్ అండ్ టెక్నాలజీ పబ్లిక్ అవుట్‌రీచ్ ప్రధానాంశంగా జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా స్టూడెంట్స్ సైన్స్ విలేజ్‌లో నూతన ఆవిష్కరణలు, శాస్త్రీయ అక్షరాస్యత, క్లిష్టమైన ఆలోచనలు అనే అంశాలపై జరగనున్న వర్క్‌షాపులో కంచరాం పాఠశాల విద్యార్థులంతా పాల్గొంటారని తెలిపారు. జాతీయస్థాయిలో జరగనున్న కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులను జిల్లా విద్యాశాఖాధికారి బి. లింగేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ డీఈఓ పి.బ్రహ్మాజీ, హెచ్‌ఎం వీవీ వసంతకుమార్, సిబ్బంది అభినందించారు.

గత అనుభవాల దృష్ట్యా ఎంపిక..

విద్యార్థులు పాఠశాలలో గతంలో చేసిన ప్రయోగాల దృష్ట్యా ఎస్‌సీఈఆర్‌టీ (స్టేట్ కౌన్సిల్ ఆఫ్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్) డైరెక్టర్ నేరుగా కంచరాం పాఠశాల విద్యార్థులను జాతీయస్థాయికి ఎంపికచేశారు. విద్యార్థులు చేపట్టిన ప్రయోగాలు ఉన్నతాధికారులను ఆకట్టుకోవడంతో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు పాఠశాలలను ఎంపిక చేశారు. జిల్లాలో రెండు పాఠశాలలకుగాను కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ పాఠశాలలో కాంతికి సంబంధించి ప్రయోగాలు, సంప్రదాయ పద్ధతిలో చిరుధాన్యాల పాడితయారీని విద్యార్థులు ప్రయోగాల ద్వారా నిరూపించి రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందారు.

గడప గడపకు పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

ఇంతవరకు జరిగిన పనులు ఇలా..

నియోజకవర్గం	మంజూరైన పనులు	నిధులు (లక్షల్లో)	పూర్తయిన పనులు	వెచ్చించిన నిధులు (లక్షల్లో)	పురోగతిలో ఉన్న పనులు
పార్వతీపురం	308	రూ.1072	78	రూ.242	36
సాలూరు	399	రూ.959	78	రూ.152	37
కురుపాం	789	రూ.1791	123	రూ.212	122
పాలకొండ	270	రూ. 652	74	రూ.131	73

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో మంజూరైన గడపగడపకు మన ప్రభుత్వం పనులు త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి ఎంవీఆర్. కృష్ణాజీ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ పార్వతీపురం, కురుపాం, సాలూరు, పాలకొండ నియోజకవర్గాల్లో గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో 1766 పనులకు గాను రూ.44.75 కోట్లు అంచనా వ్యయంతో నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అందులో 353 పనులు పూర్తికాగా, మరో 351 పనులు వివిధ దశలలో ఉన్నాయని, ఇంతవరకు రూ.7.37కోట్లు మాత్రమే వెచ్చించారని, కాంట్రాక్టర్లకు చెల్లింపులు కూడా జరిగాయని చెప్పారు. ప్రస్తుతం పనులు నిర్వహించేందుకు వాతావరణం అనుకూలంగా ఉందని, నిధులు కూడా పుష్కలంగా ఉన్నాయి కావున కాంట్రాక్టర్లు పనులు వేగవంతం చేయాలని కోరారు. పనులు త్వరితగతిన పూర్తిచేసేలా స్థానిక ప్రజాప్రతినిధులు కూడా సహకరించాలన్నారు.

700 సారా ప్యాకెట్ల స్వాధీనం

పాచిపెంట: ఇద్దరు వ్యక్తుల నుంచి 700 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్సై మునలయ్య తెలిపారు. మక్కువ మండలం ఎస్ పెద్దవలస గ్రామానికి చెందిన కలికోట చందు, వెలగడ జంపయ్యలు సారా తరలిస్తుండగా పట్టుబడ్డారని, వారి నుంచి 700 ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఈనెల 15న స్పందన రద్దు

పార్వతీపురం: ప్రతి సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఈనెల 15న సంక్రాంతి పండగ ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించినందున స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అర్జీదారులు ఈవిషయాన్ని గమనించాలని కోరారు.

22న శ్రీరామ భక్తుల శోభాయాత్ర

- కరపత్రాలు ఆవిష్కరించిన ఈఓ కిశోర్‌కుమార్



శోభాయాత్ర కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఈఓ కిశోర్ కుమార్ తదితరులు

నెల్లిమర్ల రూరల్: అయోధ్యలో రామమందిర ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 22న శ్రీరామ భక్తులు శోభాయాత్ర నిర్వహించనున్నారు. రామభద్రపురంలో శోభాయాత్ర ప్రారంభమై గజపతినగరం, విజయనగరం మీదుగా రామతీర్థం దేవస్థానం వరకు సుమారు 600 మంది భక్తులతో శోభాయాత్ర జరగనుంది. ఈ సందర్భంగా పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ఈఓ కిశోర్ కుమార్ శ్రీరామభక్తుల శోభాయాత్ర కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. శోభాయాత్ర నిర్వాహక కమిటీ ప్రతినిధి సత్యనారాయణ, రామతీర్థం సేవాపరిషత్ వ్యవస్థాపకుడు జ్యోతిప్రసాద్ మాట్లాడుతూ..రామభద్రపురం మండలంలోని దుప్పలపూడి గ్రామానికి చెందిన గురుస్వామి బర్ల రామారావు ఆధ్వర్యంలో 600 మంది భక్తులతో శోభాయాత్ర జరుగుతుందన్నారు. విజయనగరంలోని కోట జంక్షన్ నుంచి మూడు లాంతర్లు మీదుగా శోభాయాత్ర నిర్వహించి రామతీర్థం చేరుకుంటారని తెలిపారు. అనంతరం రామతీర్థం కల్యాణ వేదిక వద్ద భారీ అన్నసమారాధన జరిపిస్తామని, భక్తులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామతీర్థం ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీనివాసరావు, సత్యం, ధర్మ రక్షా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, అర్చకులు సాయిరామాచార్యులు, మల్లికార్జున శర్మ, సిబ్బంది రామారావు, తులసి, ధవళ లక్ష్మణరావు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్త



లక్ష్మి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు



లక్ష్మి (ఫైల్)

గుర్ల: మద్యానికి బానిసయ్యావని, కుటుంబం ఆర్థికంగా నాశనం అవుతోందని మందలించిన భార్యను మద్యంమత్తులో ఉన్న భర్త కర్రతో కొట్టి హత్యకు పాల్పడ్డాడు. గుర్ల మండలంలోని కొండగండ్రేడులో గురువారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై చీపురుపల్లి సీఐ ఉపేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొండగండ్రేడుకు చెందిన మునకాల సత్యం, లక్ష్మి(45) భార్యభర్తలు. సమారు 20 ఏళ్ల పాటు సుఖసంతోషాలతో జీవనం సాగించేవారు. అయితే గడిచిన ఐదేళ్లుగా సత్యం మద్యానికి బానిసయ్యాడు. కుటుంబసభ్యులు సంపాదించిన నగదు మొత్తం మద్యానికి ఖర్చు చేయడంతో పాటు గ్రామంలో సుమారు రూ.15 లక్షలు అప్పులు చేశాడు. మద్యం తాగి ఇంటికి వచ్చిన ప్రతిసారీ భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగేది. రోజులాగానే లక్ష్మి గురువారం సాయంత్రం వారి కళ్లం వద్ద ఆవుకు పాలు పితుకుతున్న సమయంలో తాగివచ్చిన భర్తతో వాగ్వాదానికి దిగింది. ఆ సమయంలో కోపోద్రిక్తుడైన సత్యం భార్య తలపై పెద్దకర్రతో కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న గుర్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉపేంద్ర తెలిపారు. మృతిచెందిన లక్ష్మికి డిగ్రీ చదువుతున్న కొడుకు గణేష్, వివాహమైన కుమార్తె జ్యోతి ఉన్నారు. హత్యకు పాల్పడిన భర్త సత్యం పరారీలో ఉన్నాడు.

ఘనంగా జేఎన్‌టీయూ జీవీ వ్యవస్థాపక దినోత్సవం

విజయనగరం అర్బన్: పట్టణంలోని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం యూనివర్సిటీ ప్రాంగణంలో శుక్రవారం ఘనంగా జరిగింది. తొలుత ఏపీఐటీఏ, డిజిటల్ మానిటరింగ్ సెల్, డిజిటల్ హబ్ సెంటర్స్‌ను యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య ప్రారంభించి, యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథి ఏపీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ సీఈఓ డీవీరామకోటిరెడ్డి మాట్లాడుతూ రాబోయే రెండు మూడు సంవత్సరాల్లో జేఎన్‌టీయూ జీవీ బ్రాండెడ్ యూనివర్సిటీగా మార్పు చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.గురునాథ్, యూనివర్సిటీ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల ప్రతినిధులు డాక్టర్ మజ్జి శశిభూషణరావు, డాక్టర్ బి.అరుంధతి, పి.రాజేష్, డి.వెంకట్రావు, ఆర్.రజని, యూనివర్సిటీ డైరెక్టర్లు కె.బాబులు, కేసీబీరావు, డి.రాజ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.